యానాంలో దారుణ హత్య

- 10 సార్లు కత్తితో పొడిచి నిందితుడు పరారీ
- తండ్రిని చంపినందుకు కొడుకు ప్రతీకారం 7

అద్వితీయంగా...

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా.. ఆనంద నిలయ వర పరిపాలకా.. గోవిందా హరి గోవిందా.. గోకులనందన గోవిందా అంటూ భక్తజనం మొక్కారు.. ఏడుకొండల వాడా వెంకటేశ్వరా.. భక్తజనుల వాడపల్లి వెంకన్నా అంటూ కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం వాడపల్లి వెంకన్న ఆలయానికి భక్తజనం పోటెత్తారు.. క్యూలైన్లు కిక్కిరిశాయి.. గోవిందుడి న్నామ స్మరణతో ఆలయం మారుమ్రోగింది.. ఆలయ ఆవరణలో ప్రత్యేక అలంకరణలో స్వామి దర్శనమిచ్చారు.. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో చేసిన ఫల,పుష్ప ప్రదర్శన ఆకట్టుకుంది.. చూసిన కనులదే భాగ్యమట అన్నట్టు ఉంది.. తిరువీధుల్లో ఊరేగిన స్వామిని భక్తజనం దర్శించుకున్నారు.. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

6





పొల్లూరు జలపాతం



తీరప్రాంత కాలుష్య నివారణకు పకడ్బందీ ప్రణాళిక

- ఉప్పాడ ప్రాంతంలో పరిస్థితులపై సమగ్ర అధ్యయనం
- పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్
- మత్స్యకారుల సమస్యలకు 100 రోజుల ప్రణాళికతో పరిష్కారం
- మంగళగిరిలో అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష


6


పీఎం ధన ధాన్య కృషీ యోజన పథకం ప్రారంభం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన పీఎం ధనధాన్య కృషీ యోజన పథకం, పప్పుధాన్య నిర్భరత మిషన్ కార్యక్రమాన్ని జిల్లా అధికారులు వీక్షించారు. ప్రత్యక్ష ప్రసారమైన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్‌తో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు, మండల వ్యవసాయశాఖ అధికారులు హాజరయ్యారు. ఈ పథకం ప్రధాన లక్ష్యం ధాన్యం, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో స్వావలంబ సాధించడమని ప్రధాని వివరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడం, మార్కెట్ సదుపాయాలు, పథకాలు అందించడమే ఉద్దేశమని పేర్కొన్నారు.

ఆదివారం ప్రత్యేకం

గోదారిలో.. తేలియాడుదాం!






- (కాకినాడ/రాజమహేంద్రవరం/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఊటి వెళదామా.. కొడైకెనాల్ వెళదామా.. కేరళ వెళదామా.. ఈ సీజన్‌లో పర్యాటక ప్రేమికులు ఆలోచించే ప్రదేశాలివీ.. ఒక సారి అలా ట్రిప్ వేసి ఇలా వచ్చేస్తారు.. అంత దూరం ఎందుకు దండగ.. ఒకసారి ఆలోచించు చూడు.. మన చుట్టూ ఎన్నో పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి నిండుగా... గోదావరి జిల్లా అంటే ప్రకృతి అందాలకు నెలవు.. ఒక పక్క గోదావరి.. మరో పక్క కేరళను తలపించే కోనసీమ కొబ్బరితోటలు.. రహదారులకు ఇరువైపులా గోదావరి కాలువలు.. కాకినాడలో సుదీర్ఘ సాగర తీరం.. ప్రఖ్యాత ఆలయాలు.. ప్రసిద్ధి చెందిన బౌద్ధారామాలు.. ఏజెన్సీలో అందమైన సుందర సోయగాలు.. పాపికొండల నడుమ గోదారి పరవళ్లు.. ఒకరకంగా చెప్పాలంటే గోదావరి జిల్లా అందాలు వర్ణించాలంటే మాటలు చాలవు. అటు ప్రఖ్యాత ద్రాక్షారామ, కోటిపల్లి, వాడపల్లి, అప్పన పల్లి, అంతర్వేది, మురమళ్ల, కుండలేశ్వరం, అయినవల్లి ఆలయాలు.. కట్టిపడేసే అంతర్వేది, ఓడలరేవు, పాసర్లపూడి, ఎస్.యానాం, చిరయానాం, చింతలమోరి తీర ప్రాంతాల అందాలు.. ఆదుర్రు బౌద్ధ స్థూపాలు, దిండి బోటుషికారు ఒకటేంటి కోనసీమ జిల్లా అందాలు ఎన్ని రోజు లు చూసినా తనివి తీరదు. ఇన్ని సహజసిద్ధ అందాలున్న జిల్లాకు ఇతర రాష్ట్రాల పర్యాటకుల తాకిడి అంతంత మాత్రమే.గత ప్రభుత్వ హయాంలో పర్యాటకం పడకేసింది. కూటమి ప్రభుత్వం గోదావరి జిల్లాలను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు భారీ కార్యాచరణ చేపట్టింది.

ఎన్నెన్నో అందాలు..



పాములేరులోని జంగిల్ స్టార్ రిసార్ట్

(రంపచోడవరం-ఆంధ్రజ్యోతి) మన్యంలో పర్యాటకులకు తూర్పు కనుమల మీద మంచు దుప్పటి తెరుచుకుంటోంది. అల్లూరి జిల్లా మారేడుమిల్లి, చింతూరు మండలాల్లో జలపాతాలు, గుడిసలో పచ్చటి కార్పెట్ కమ్ముకున్న కొండల నడుమ సూర్యోదయాలు, రంప శివుడు, పింజరికొండ జలపాతం, వీటికి మించి పాపికొండల నడుమ గోదావరిపై విహారం ఇలా ఎన్నో పర్యాటక ప్రాంతాల సందర్శనకు శీతాకాలం అనువుగా ఉండడంతో పర్యాటకులు సందర్శనకు తరలివస్తున్నారు. చావడికోట కొండలు, మారేడుమిల్లికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుంపవలస జలపాతం ఆకట్టుకుంటున్నాయి. గుడిస స్థానంలో చావడికోటను ఎంచుకుంటున్నారు. మోతుగూడెం శివారు పొల్లూరు జలపాతం, మోతుగూడెంలో ఉన్న జల విద్యుత్ కేంద్రం, రిజర్వాయర్, పవర్ కెనాల్ అక్కడ ఉన్న పుష్ప షూటింగ్ స్పాట్‌కు పర్యాటకులు వెళుతున్నారు. రంపచోడవరంలో రంప శివాలయం పక్కనే ఉన్న జలపాతం, సీతపల్లి వాగు వద్ద ఉన్న విహార ప్రాంతం, మన్యం ప్రారంభంలోనే ఉన్న సీతపల్లి గడిబాపనమ్మ క్షేత్రం, టీటీడీ నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం టెంపుల్ టూరిజంలో ఆకట్టుకుంటున్నాయి. పర్యాటక ప్రాంతాల సందర్శనలో బసకు వీలుగా మారేడుమిల్లి, మోతుగూడెం, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో రిసార్టులు అనేకం ఉన్నాయి.

దిండి వెళితే.. తిరిగి రావాలనిపించదండి!

గోదావరిలో బోటుపై రాత్రి బస చేస్తూ నదిలోంచి వెన్నెలను చూస్తే ఆ మజాయే వేరు.. పర్యాటకులను అలరించేలా ప్రభుత్వం హౌస్ బోట్లను త్వరలో దించుతోంది. రోజంతా నదీ విహారంచేసి, రాత్రివేళల్లో గోదావరిలో బోటులోనే బస చేసేలా చేయబోతోంది. ఇందుకు కోనసీమ జిల్లా దిండి, పాపికొండల్లోను ఏపీటీడీసీ, ప్రైవేటు లగ్జరీ బోట్లను ప్రైవేటు సంస్థల ద్వారా అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రైవేటు కంపె నీల ద్వారా ఈ బోట్లను నడపనుంది. త్వరలో దిండి వద్ద లగ్జరీ హౌస్‌బోట్‌ను నడపనుంది. ప్రస్తుతం ఇక్కడ ఏపీటీడీసీవి రెండు హౌస్ బోట్లు ఉన్నాయి. ఇవి రాత్రివేళ రిసార్టుకు ఆను కుని గోదావరిలో ఉంచి పర్యాటకులకు బస సదుపాయం కల్పిస్తోంది. రెండు పడక గదులు ఉండే ఈ హౌస్ బోటులో నలుగురు పెద్దలు, నలుగురు పిల్లలతో గడిపేలా 12 గంటలకు రూ.12 వేలు, 24 గంటలకు రూ.15 వేలు వసూ లు చేస్తున్నట్టు మేనేజర్ మురళీధర్ చెప్పారు. దీనికి డిమాండ్ ఉండడంతో త్వరలో ఆరు వరకు లగ్జరీ బోట్లను ప్రవేశపెట్టబోతోంది. ఇందులో ఏపీటీడీసీవి రెండు, మిగిలినవి ప్రైవేటు బోట్లు. కాకినాడలో రూ.87 కోట్లతో తాజ్‌ఎస్వీఎస్ గ్రూపు భారీ లగ్జరీ హోటల్, కన్వెన్షన్ సెంటర్ రాబోతోంది. ఈ పెట్టుబడికి రాష్ట్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది.





వెన్నెల్లో గోదారి అందం..

రాజమహేంద్రవరం- కొవ్వూరు మధ్య అఖండ గోదావరిలో ఇక హౌస్ బోట్ల టూరిజం మొదలుకానుంది. ప్రభుత్వం మూడు హౌస్ బోట్లను మంజూరు చేసింది. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో ఒకటి,సరస్వతీ ఘాట్‌లో ఒకటి, కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఒక బోటును ఆపరేట్ చేయనున్నారు. కొత్త సంవత్సరం నుంచే ఈ హౌస్‌బోట్ల షికారు మొదలవుతుందనే అంచనా. గోదావరి వరదల నేపథ్యంలో మూడు నెలల పాటు నిలిచిపోయిన పాపికొండలు విహారయాత్ర తిరిగి ప్రారంభమైంది.

- ఆహా..అందాల గోదారి
- పర్యాటక ప్రోత్సాహానికి కసరత్తు
- కేరళ తరహాలో హోంస్టేలు
- కోనసీమ, తూర్పున ఇళ్లు గుర్తింపు
- రాజమండ్రి, కోనసీమలో హౌస్‌బోట్లు
- కాకినాడలో లగ్జరీ హోటల్‌కు ఓకే



వస్తోంది.. హోంస్టే!

పర్యాటకుల కోసం కేరళ తరహాలో ఇక్కడా హోంస్టే త్వరలో అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పర్యాటకులకు బస, కోనసీమ రుచులతో భోజనానికి రోజుకు రూ.700 నుంచి రూ.1,300 మాత్రమే ఖర్చయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. డ్వాక్రా మహిళలను హోంస్టే పథకానికి సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం జిల్లాలో 20 హోంస్టే ఇళ్లు గుర్తించారు. తూర్పుపాలెం, పడమటిపాలెం, మల్కిపురం, లక్కవరం, కేశనపల్లి ఒక్కో ఇళ్లు.. దిండిలో నాలుగు, అంతర్వేదిపాలెం నాలుగు, సోంపల్లి ఐదు, అప్పన్నపల్లి, ఆదుర్రులో ఒకటి చొప్పున ఇళ్లు ఇవ్వడానికి అంగీకారం కుదిరింది.పర్యాటకులకు గైడ్‌లుగా రాజోలు నియోజకవర్గం నుంచి ఏడుగురు, కోనసీమ రుచులు వండేందుకు 26 మంది ముందుకు వచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో 100 ఇళ్లను హోంస్టేలుగా గుర్తించారు. ఇవన్నీ కడియం, రాజానగరం, కోరుకొండ, గోకవరం, కొవ్వూరు, తాళ్లపూడి, నిడదవోలు పరిధిలో ఉన్నాయి.

జిల్లాలో భ్రూణ హత్యలను నిర్మూలించాలి : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ఆడశిశువుల పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నిర్మూలించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, స్త్రీ శిశుసంక్షేమశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీమెం బరు అప్రోప్రియేట్ అథారిటీ, జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో లింగనిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి పెట్టి డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలన్నారు. లింగ నిర్ధారణ దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. జిల్లాస్థాయిలో గుర్తింపు పొందిన 159 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టరు నరసింహనాయక్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాల సమాచారాన్ని టోల్‌ఫ్రీ నెంబరు 18004253365కు ఇవ్వాలన్నారు. డీఐవో డాక్టరు సుబ్బరాజు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టరు లావణ్యకుమారి, డీసీహెచ్‌ఎస్ డాక్టరు స్వప్న, టూటౌన్ సీఐ అప్పలనాయుడు, డీడీఐ పీఆర్ నాగార్జున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



మురుగునీటి డ్రెయిన్‌ని తవ్వేసి అక్రమ కల్వర్టు నిర్మాణం చేస్తున్న దృశ్యాలు

దర్జాగా.. డ్రెయిన్ కబ్జా!

చోద్యం చూస్తున్న అధికారులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్లో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. కాకినాడ సిటీకి నాలుగు పక్కలా రూరల్ మండలం వ్యాపించి ఉండడంతో ఇక్కడి భూముల ధరలకు లెక్కలొస్తున్నాయి. దాంతో కనిపించిన ఏ కొద్దిపాటి ప్రభుత్వ, రెవెన్యూ, సామాజిక, పోరంబోకు, డ్రైనేజీ, పంటకాల్వ, ఖాళీ జాగా కనిపించినా అక్రమంగా, దౌర్జన్యంగా కబ్జా చేసేందుకు వెనుకాడడం లేదు. ప్రభుత్వ స్థలాలను సంరక్షించాల్సిన అధికారులు రియల్టర్లు, కబ్జాదారులిచ్చే కాసులకు కక్కుర్తిపడడంతో ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణదారుల పరం అవుతున్నాయి. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన మురుగునీటి డ్రెయిన్ అచ్చంపేట సెంటర్ కరెంట్ ఆఫీసుకు చేర్చి మెయిన్‌రోడ్డులో ఉంది. పూర్వం ఈ కాలువ గుండా తిమ్మాపురం పరిసర ప్రాంతాలకు చెందిన వ్యవసాయ భూముల నుంచి వచ్చే మిగులు నీరు సముద్రంలోకి వెళ్లేందుకు వినియోగించేవారు. రమణయ్యపేట పంచాయతీలో భూములన్నీ లేఅవుట్లు కావడంతో ఈ కాలువ తిమ్మాపురం పరిధిలోని అవంతినగర్, మారుతీనగర్, పేట కాలువ మీదుగా రమణయ్యపేట కాలువ నుంచి సముద్రంలో కలుస్తోంది. గ్రామాల్లో పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో మురుగు ప్రధానమైంది. డ్రెయిన్ వ్యవస్థ సక్రమంగా లేక మురుగునీటిపారుదలకు తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా గ్రామాలు దుర్గంధం, దోమలతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. కాలువ ఆధునికీకరణ, సంరక్షణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. రమణయ్యపేటకు చెందిన భూమిని 1986లో డీటీసీపీ లేఅవుట్ చేశారు. అచ్చంపేట సెంటర్ నుంచి సర్పవరం జంక్షన్ వరకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, ఈ లేఅవుట్‌కి చేర్చి మురుగునీటి కాలువ ఉంది. దాంతో ప్రధాన రహదారి పడమర వైపున రహదారి ఇచ్చే అవకాశం లేక, తూర్పు దిక్కులో ఈ లేఅవుట్‌లోని ప్లాట్లకు రహదారి చూపించారు. ఈ ప్లాట్లకు ఖరీదు పెంచుకునేందుకు వీలుగా మురుగునీటి డ్రెయిన్‌ని తొలగించి, దానిపై కల్వర్టు నిర్మించేందుకు వైసీపీ హయాంలో 2020లో రియల్టర్లు ప్రయత్నించడం, స్థానికులు అడ్డుకోవడం జరిగింది. తిమ్మాపురం ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వర్షం, వరద, మురుగు, మిగులునీరు ముందు కెళ్లే దారిలేక, గ్రామాల్లో ముంపు సమస్య తలెత్తుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఈ మురుగు డ్రెయిన్‌ని ఆక్రమించేందుకు పావులు కదిపారు. రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్లతో డ్రెయిన్‌లో గోతులు తవ్వించి, కల్వర్టు నిర్మాణం కోసం పునాదిగా కాంక్రీట్, సిమెంట్‌తో ప్లాట్‌ఫారం నిర్మించారు. కల్వర్టు నిర్మాణానికి డ్రైనేజీ అధికారులు అనుమతి ఇచ్చారని రియల్టర్లు పేర్కొంటున్నారని, లెటర్ అడిగితే చూపించడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

'కాకినాడ నగరంలో ఎక్కడా ఎటువంటి ఫ్లెక్సీ కనిపించడానికి వీల్లేదు..' అంటూ కాకినాడ స్మార్ట్‌సిటీని ఫ్లెక్సీ ఫ్రీ సిటీగా ప్రకటిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీచేశారు. 2024 జూలై 19న జారీ చేసిన ఈ ఆదేశాల అమలులో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పబ్లిసిటీ.. ఫ్లెక్సీబులిటీ!

- ఎవరికి వారే ప్రచారం జోరే..
- ఎక్కడా అమలుకాని కలెక్టర్ ఆదేశాలు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి) రోడ్డుపక్కన ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు కట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయం తెలుసుకుని నగరంలో కొన్ని ప్రధాన ప్రాంతాలను ఫ్రీఫ్లెక్సీ సిటీగా గతంలో కలెక్టర్ ప్రకటించారు. స్థానిక సర్పవరం జంక్షన్ నుంచి భానుగుడి సెంటర్ వరకూ, టూటౌన్ నుంచి జగన్నాథపురం వరకూ, కోకిలా సెంటర్ నుంచి సినిమా రోడ్డు, వన్‌టౌన్ స్టేషన్ వరకూ ఫ్రీఫ్లెక్సీ సిటీగా ప్రకటించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయితే ఈ ఆదేశాలను అమలుచేయడంలో నగరపాలక అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. వివిధ పార్టీల నేతలతోపాటు, వ్యాపార, వ్యక్తిగత ఫ్లెక్సీలు ఇష్టానుసారంగా నగరంలో కనిపిస్తున్నాయి. నగరంలోని టూటౌన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి, ముత్తా వారధి, వైఎస్సార్ వారధి, కల్పనా బ్రిడ్జిపై ఫ్లెక్సీలు ఇబ్బడి ముబ్బడిగా కనిపిస్తున్నాయి.

ఎక్కడ చూసినా అవే..

ఫ్లెక్సీ.. ఫ్లెక్సీ.. వేడుక ఏదైనా మొట్టమొదట కనిపించేవి ఇవే. పుట్టినరోజులు, వివాహ వేడుకలు, విషాద కార్యక్రమాలు, నాయకులకు స్వాగతాలు, అభినందనలు ఇలా సందర్భానికి తగ్గట్టుగా ఫ్లెక్సీలు, బ్యానర్లు వేయించడం అలవాటుగా మారింది. ఎవరైనా పదవులు పొందినా, ఎవరైనా ఎన్నికల్లో నిలున్నా, ఎవరైనా మంత్రి, ప్రముఖ రాజకీయ నాయకులు వస్తున్నా.. తమ అభిమాన నేతల పుట్టినరోజు వచ్చినా.. వారి దృష్టిని ఆకర్షించేలా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కోసం కొందరు కార్యకర్తలు పోటీ పడుతున్నారు. తమ అధినాయకుడి ఫొటోలతోపాటు తమ ఫొటోలను ముద్రించి వీధుల్లో వేలాడదీస్తున్నారు. ఇక ఇటీవల కాలంలో ఏదైనా షాపింగ్ మాలో, ఇతర వ్యాపార సంస్థ ప్రారంభానికో ప్రముఖుల రాక సందర్భంగా కూడా ఈ ఫ్లెక్సీలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. దీనివల్ల అనేకానేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటివల్ల నగరపాలక సంస్థకు ఏవిధమైన ఆదాయం రాకపోగా, ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మరోవైపు ఎటువంటి అనుమతి తీసుకోకుండా ఇష్టానుసారంగా ఫ్లెక్సీలు పెట్టేస్తున్నారు. స్థానిక సర్పవరం జంక్షన్ మొదలు బోట్‌క్లబ్, నాగమల్లితోట జంక్షన్, భానుగుడి, టూటౌన్ బ్రిడ్జి, మెయిన్‌రోడ్డు, మసీద్ సెంటర్, జగన్నాథపురం వరకూ ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. వీటిని నిరోధించాల్సిన కార్పొరేషన్ సిటీ ప్లానింగ్ విభాగంగా ఒక్కేసారి ఒక్కే విధంగా ప్రవర్తిస్తోంది. నగరంలో వారంలో రెండు రోజులు ఏదొక కొత్త వ్యాపార సంస్థ కొత్త షాపు ఏర్పాటు చేయడం సర్పవరం జంక్షన్ మొదలుకొని ఆయా వ్యాపార సంస్థ ప్రాంతం వరకు వందలకొద్దీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్డు మలుపులు ఉన్న ప్రాంతాలనూ వదలడం లేదు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న దేశనాయకులు, ప్రముఖుల విగ్రహాలు చుట్టూ కూడా ఫ్లెక్సీలతో మూసేస్తున్నారు. నగరంలో ఎక్కడైనా ఫ్లెక్సీలు పెట్టుకోవాలంటే కార్పొరేషన్ అధికారుల అనుమతులు తీసుకోవాలి. ఎవరైనా నిబంధనలు పాటించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే సంబంధిత వ్యాపార సంస్థ నుంచి అపరాధ రుసుం వసూలు చేసే అధికారం అధికారులకు ఉంది. కానీ నగరంలో నిబంధనలను వారే గాలికి వదిలేశారు. అపరాధ రుసుం వసూలు చేయకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇటీవల కాకినాడ నగరంలోని భానుగుడి పద్మప్రియ థియేటర్ సమయంలో భారీగా ఏర్పాటు చేసిన కటౌట్ ఈదురుగాలులకు నేలకొరిగింది. ఎవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

స్వయంగా డిప్యూటీ సీఎం చెబితేనే..

ప్లాసిక్ భూతాన్ని తరిమికొట్టాలంటే.. ముందుగా ఫ్లెక్సీలను బ్యాన్ చేయాలి. పర్యావరణ పరిరక్షణ కోసం ముందుగా నగరాలను ఫ్లెక్సీ ఫ్రీ సిటీలుగా మార్చాలి. గురువారం కాకినాడ జిల్లా పర్యటన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలుకుతూ నగరంలో భారీఎత్తున ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై ఆయన అసహనం వ్యక్తం చేయడంతో జనసేన, ఇతర ఫ్లెక్సీలను అధికారులు తొలగించినట్టు సమాచారం

అద్వితీయంగా..


విద్యుద్దీపాలంకరణలో ఆలయ ప్రాంగణం


కొలువుతీరిన ఉత్సవమూర్తులు

- రెండో రోజు ఘనంగా బ్రహ్మోత్సవం
- ఆకట్టుకున్న ఫల,పుష్ప అలంకరణ
- వాడపల్లికి పోటెత్తిన భక్తజనం
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు
- హంస వాహనంపై ఊరేగిన స్వామి
- మారుమ్రోగిన గోవింద న్మామస్మరణ
- కిటకిటలాడిన తిరుమాఢవీధులు

ఆత్రేయపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవిందా న్మామస్మరణలతో వాడపల్లి మారుమ్రోగింది.. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామి వారికి నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, భాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని ఫల పుష్పాలతో సర్వాంగ, సుందరంగా అలం కరించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. వసంత మండపంలో ఫలపుష్పాలతో అలంకరించిన వేదిక వద్దకు స్వామి వారిని తీసుకువచ్చి సంకల్పం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సప్తకలశారాధన, అభిషేకం, ప్రధాన హోమాలు నిర్వహించా రు. వివిధ రకాల పుష్పాలతో శ్రీవారికి మహాపుష్పయాగం అత్యంత ఘనంగా చేశారు. అశేష భక్తజనం శ్రీపుష్పోత్సవాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం సాయంత్రం ప్రధాన హోమాలు నిర్వహించి సహస్ర దీపాలంకరణ సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటకు సరస్వతి అలంకరణలో శ్రీవారు హంస వాహనంపై విహరించి భక్తులకు అభయ హస్తం అందించారు. తిరువీధుల్లో విద్యుద్దీపాలు,మేళతాళ మంగళవాయిద్యాలు, భక్తజన గోవిందనామస్మరణల నడుమ హంస వాహన సేవ కన్ను ల పండువగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.శంఖుచక్ర నామాలతో ఏర్పాటు చేసిన ఫొటోషూట్ వద్ద భక్తులు సందడి చేశారు.కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఛైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం వేలాదిగా భక్తులు వచ్చారు. ఛైర్మన్, ఈవో దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

ఒక్కరోజు.. రూ.55.91 లక్షలు

వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.55.91 లక్షలు లభించినట్టు ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.


ఉత్సవమూర్తులకు అభిషేకం

భక్తులకు 21 వేల మొక్కలు

లక్షతులసీ, ఉసిరి, మారేడు మొక్కల వితరణ య జ్ఞంలో భాగంగా శనివారం పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం అర్ధవరానికి చెందిన పెన్మెత్స ఆదినారాయణరాజు-నాగవల్లి దంపతులు 21 వేల తులసి, ఉసిరి, మారేడు మొక్కలను భక్తులకు వితరణ చేశారు.లక్ష మొక్కల పంపిణీలో భాగంగా ఇప్పటి వర కూ 54 వేల మొక్కలు వితరణ చేసినట్టు తెలిపారు. మొక్కల విశిష్టతను భక్తులకు వివరించారు.


ఫల, పుష్పాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణం


స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ చైర్మన్, కమిషనర్ దంపతులు


ఆలయానికి పోటెత్తిన భక్తజనం


ఆలయంలో శంఖుచక్రాలు

క్షీరాధివాసం



బిక్కవోలు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠించే ద్వాదశ జ్యోతిర్లింగాలు,అష్టాదశ శక్తిపీఠ దేవతామూర్తులను శుక్రవారం రాత్రి క్షీరాధివాసంలో ఉంచారు. గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలోని వరాహమూర్తి ఎదురుగా ఉన్న కోనేరులో ఉంచగా భక్తులు వాటిపై పాలు పోయడానికి పోటీపడ్డారు. దేవతామూర్తుల కు శనివారం ఉదయం గణపతిపూజ,గోపూజ, మండపారాధన, వేదపారాయణ కార్యక్రమాలు నిర్వహించి ధాన్యాధివాసంలో ఉంచారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కార్తీకమాసోత్సవాలపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష

2న నరసన్న గిరి ప్రదక్షణ

కోరుకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కార్తీక మాస శుద్ధ ద్వాదశి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. కార్తీక మాసం పురస్కరించుకుని కోరుకొండ దేవాలయంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి, ఇతర అధికారులు, వివిధ శాఖల అధికారులతో శనివారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్షించారు. కార్తీక మాసంలో నవంబర్ 2వ తేదీ క్షీరాబ్ది ద్వాదశి రోజున గిరి ప్రదిక్షణ, తెప్పోత్సవం కార్యక్రమాలకు ఎలాంటి లోటూ పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్తీక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ది ద్వాదశి) రోజున సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారి విగ్రహాలను పల్లకీపై ఊరేగించి గిరి ప్రదక్షణ అనంతరం కోనేరు వద్ద తెప్పోత్సవం చేస్తారన్నారు. వైదిక కార్యక్రమం నిర్ణీత సమయానికి తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఏ విధమైన అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెప్పోత్సవం విజయవంతం కావడానికి వీలుగా కోనేరులో నీరు నిలిచేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్తీక మాసోత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఛైర్మన్ పరాసర రంగరాజ భట్టర్, ఎంపీడీవో పి.అశోక్‌కుమార్, తహశీల్దార్ సుస్వాగతం, సీఐ వై.సత్యకిషోర్, జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, సర్పంచ్ కర్రి లక్ష్మీనరోజ వీరగణేష్, గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీనివాస్, జనసేన నాయకుడు దొర తదితరులు పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి ప్రత్యేక పూజలు


బాలబాలాజీ తొలిహారతి ఇస్తున్న దృశ్యం, దర్శనానికి బారులు తీరిన భక్తులు

మామిడికుదురు, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి దేవస్థానం శనివారం ఆశ్వయుజమాసం బహుళ పంచమి సందర్భంగా భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దేవస్థాన భక్తుల రద్దీతో కిటకిటలాడింది. స్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. దేవస్థానంలో నిర్వహించే నిత్యకల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఏర్పాట్లు చేశారు.


ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగారవల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 8వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రూ.3,02,691 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

తీరప్రాంత కాలుష్య నివారణకు పకడ్బందీ ప్రణాళిక

- ఉప్పాడ ప్రాంతంలో పరిస్థితులపై సమగ్ర అధ్యయనం
- పరిశ్రమల్లో తక్షణం పొల్యూషన్ ఆడిట్
- మత్స్యకారుల సమస్యలకు 100రోజుల ప్రణాళికతో పరిష్కారం
- కాకినాడ జిల్లాలో తీసుకునే చర్యలు దేశానికే మోడల్
- అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష


అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలోని తీరప్రాంతంతో పాటు కాకినాడ జిల్లాలోని పారిశ్రామిక కాలుష్యం, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఉప్పాడ తీరప్రాంతంలో కాలుష్యం తదితర అంశాలపై అక్కడ మత్స్యకారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో అక్కడ పరిస్థితులపై సమగ్ర అధ్యయనం నిర్వహించి నివేదిక అందజేయాలని సూచించారు. సమస్య ఉందని గుర్తించిన పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలని తెలిపారు. మత్స్యకారులు లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం 100రోజులు ప్రణాళికతో రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కాకినాడ జిల్లాలో కాలుష్య నివారణకు తీసుకునే చర్యలు దేశానికే మోడల్ ఉండే విధంగా చూడాలని చెప్పారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారుల మాటామంతి కార్యక్రమంలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, పారిశ్రామిక, తీర ప్రాంత కాలుష్యం తదితర అంశాలపై మంగళగిరిలోని క్యాంపుకార్యాలయంలో శనివారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాకినాడజిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, ఇతర అధికారులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. రాష్ట్రం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో కొత్తగా పరిశ్రమలు వస్తున్నాయి. అదే సమయంలో వీటిపై ప్రజల్లో సందేహాలు, ఆందోళనలు నెలకొన్నాయని పవన్ తెలిపారు. తీరప్రాంత పరిశ్రమలు నుంచి విడుదలయ్యే వ్యర్థాలు తమ జీవనోపాధి దెబ్బతీస్తున్నాయనే ఆందోళనలు మత్స్యకారుల్లో ఉన్నాయని, అదే ఉప్పాడ తీరప్రాంత గ్రామాల మత్స్యకారులు ఆందోళన చేయడానికి కారణమైందని చెప్పారు. పరిశ్రమలు నుంచి రసాయినిక పదార్థాలు నేరుగా సముద్రంలో కలుస్తున్నాయని, అందువల్లనే మత్స్య సంపద దెబ్బతింటోందని కాకినాడలో జరిగిన సమావేశంలో మత్స్యకారులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. మత్స్యకారుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన, వారి సందేహాల నేపథ్యంలో వారి సూచనల మేరకు ఆయా పరిశ్రమల్లో తక్షణం పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలనిఆదేశించారు. పరిశ్రమలు వలన సముద్ర జలాలు ఏమేర కాలుష్యం అవుతున్నాయి, జల, వాయు కాలుష్యం ఎంత అనే అంశంపై అధ్యయనం చేపట్టి నివేదిక రూపొందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు పొల్యూషన్ ఆడిట్ నిర్వహించడం ద్వారా గుర్తించిన లోపాలు, కాలుష్య కారకాలను సరిచేసుకునే విధంగా పరిశ్రమలను ఆదేశించాలన్నారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారం, కాలుష్య నియంత్రణపై పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని 100రోజుల్లో పూర్తిస్థాయి రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందులో ఎటువంటి జాప్యం జరుగరాదని స్పష్టం చేశారు. పారిశ్రామికవర్గాలు తమ పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యాన్ని తగ్గించుకునే విషయంపై దృష్టిసారించాలని సూచించారు. ఇప్పటికే పలు దేశాల్లో కాలుష్య నివారణపై అత్యాధునిక పద్ధతులు అవలంభిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డాక్టర్ కృష్ణయ్య, మెంబర్ సెక్రటరీ శరవణన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్పీ క్రికెట్ ఛాంపియన్ ట్రోఫీ

కాకినాడ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సబ్ డివిజన్, పెద్దాపురం సబ్ డివిజన్, ఏఆర్ టీమ్, హోంగార్డ్స్ టీమ్‌లకు కాకినాడ ఆర్‌ఎంసీలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు శనివారంతో ముగిశాయి. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మ్యాచ్‌ల్లో ఏఆర్ టీమ్ విజేతగా నిలిచింది. లీగ్ మ్యాచ్‌లలో ప్రదర్శన ఆధారంగా కాకినాడ సబ్ డివిజన్ టీమ్ అలాగే ఏఆర్ టీమ్ ఫైనల్స్‌కు అర్హత సాధించాయి. అనంతరం శనివారం కాకినాడ ఆర్‌ఎంసీ గ్రౌండ్‌లో ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సా గింది. అద్భుత ప్రదర్శనతో ఏఆర్ టీమ్ విజేతగా నిలవగా, కాకినాడ సబ్‌డివిజన్ టీమ్ రన్నరప్‌గా నిలిచింది. అనంతరం ఎస్పీ విజేతలకు ట్రోఫీ, మెమెంటోలు, మెడల్స్‌ను అందజేశారు. అలాగే రన్నరప్ జట్టుకు కూడా మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది నిత్యం శారీరక దృఢత్వం కలిగి ఉండడం తప్పనిసరన్నారు. క్రమం తప్పకుండా క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఫిట్ ఇండియా స్ఫూర్తిని ప్రతిబింబించేలా భవిష్యత్‌లో మరిన్ని క్రీడా, ఆరోగ్య ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరిరావు, పెద్దాపురం ఎస్‌డీపీవో డి.శ్రీహరిరాజు, వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందజేసిన ఎస్పీ బిందుమాధవ్

29వ రాష్ట్ర జూనియర్ సెపక్‌తక్రా
ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక


క్రీడాపోటీల ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాల డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జరుగనున్న 29వ రాష్ట్ర జూనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలకు శనివారం బాలురు, బాలికల రెగ్యులర్ ఈవెంట్ జిల్లా జట్లు ఎంపికకు డ్రా నిర్వహించారు. ఎంపికైన జిల్లా బాలురు, బాలికల జట్టుకు స్పోర్ట్స్ కిట్లు, ప్రయాణ ఖర్చులను జిల్లా అధ్యక్షుడి ప్రతిభ స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌వీజీ ప్రకాష్ సహకారంతో ఏర్పాటుచేసినట్లు సెక్రటరీ కె.జాన్‌జోసెఫ్ తెలిపారు. జట్టు కోచ్ కె.శ్రీనివాస్, పీడీ ఎల్ జార్జి పాల్గొన్నారు.



90వ సారి రక్తదానం చేస్తున్న డాక్టర్ బాదంబాలకృష్ణ

90వ సారి బాదంబాలకృష్ణ రక్తదానం

కాకినాడరూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ హాల్లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 100మంది రక్తదానం చేయగా తన పుట్టిన రోజు సందర్భంగా బాదం బాలకృష్ణ 90వ సారి రక్తదానం చేశారు. లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్లు ఈశ్వర్‌కుమార్, విశ్వేశ్వరరావు ఉపగవర్నర్లు శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, ప్రాజెక్టు ఛైర్మన్ ఎం.వెంకటరమణ, కోఛైర్మన్లు గణేష్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ప్రతీరంగంలోనూ ఐవోటీ కీలకపాత్ర

- ఐవోటీపై శిక్షణాశిబిరం

జేఎన్టీయూకే, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని యూసీఈకే ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)పై మూడురోజుల పాటూ నిర్వహించే శిక్షణా శిబిరం శనివారం ప్రారంభమైంది. యూసీఈకే వైస్ ప్రిన్సిపాల్ జీవీఎస్‌ఆర్ దీక్షితులు ముఖ్యఅతిథిగా పాల్గొని శిక్షణా శిబిరంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రతీరంగంలోనూ ఐవోటీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. మొత్తం 80 మంది విద్యార్థులు 20 జట్లుగా శిక్షణలో పాల్గొన్నారు. ఈశిబిరానికి లీలాకుమారి కన్వీనర్‌గానూ, పుష్పలత సమన్వయకర్తగానూ వ్యవహరించగా విద్యార్థులకు ఐవోటీపై ప్రాక్టికల్ డిమానిస్ట్రేషన్లు నిర్వహించారు.


వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులతో శిక్షణా శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నేడు మంత్రి నిమ్మల పర్యటన

సామర్లకోట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు నేడు ఆదివారం పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని వాలు తిమ్మాపురంలో పారిశ్రామికవేత్త మట్టే శ్రీనివాసు కుమారుడు ఆదిత్యకృష్ణ వివాహ రిసెప్షన్ నిమిత్తం హాజరుకానున్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల వరకూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఏర్పాటుచేసిన అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి రామానాయుడు పాల్గొంటారు. అనంతరం మంత్రి రాజమహేంద్రవరంలో శెట్టిబలిజ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని సమాచార కార్యాలయ ఉపసంచాలకుడు డి.నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు.

యువతి ప్రేమించడంలేదని..
బ్లేడుతో గొంతు కోసుకున్న యువకుడు
అంబాజీపేటలో ఘటన
ఆసుపత్రికి తరలింపు

అంబాజీపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విషయమై యువతి నిరాకరించడంతో యువకుడు పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చెందిన ఎస్.పవన్ అనే యువకుడు అంబాజీపేటకు చెందిన ఓ యువతిని ప్రేమించాలని గత కొన్ని నెలలుగా కోరుతున్నాడు. ఆ యువతి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో బీఎస్సీ నర్సింగ్ చదువుతూ అక్కడే పనిచేస్తుంది. అయితే ఆ యువతి శనివారం సాయంత్రం అంబాజీపేట బస్టాండ్‌కు వచ్చిన సమయంలో తన ప్రేమ విషయాన్ని ఆ యువకుడు ఆమెతో మాట్లాడాడు. అయితే ఆ యువతి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు బస్టాండ్ వద్దే బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని పవన్‌ను వైద్యం నిమిత్తం అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

యానాంలో దారుణ హత్య
- వ్యక్తిని 10 సార్లు కత్తితో పొడిచి నిందితుడు పరారీ
- ప్రతీకార హత్యగా భావిస్తున్న పోలీసులు


హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, పోలీసులు


హత్యకు గురైన నారాయణ స్వామి (ఫైల్)

యానాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): యానాం నడిరోడ్డులో దారుణ హత్య జరిగింది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. కాకినాడ జిల్లా కాజులూరు మండలానికి చెందిన తిప్పిరిశెట్టి నారాయణస్వామి (33) హత్యకు గురయ్యాడు. వివరాల ప్రకారం.. యానాం గోపాల్ నగర్‌కు చెందిన మోకా వెంకటేశ్వరావు(57)ను కాజులూరు మండలానికి చెందిన చీటీల వ్యాపారి తిప్పిరిశెట్టి నారాయణస్వామి ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో 2022 మార్చి 12న మోకా వెంకటేశ్వరావు ఇంటికొచ్చి విచక్షణా రహితంగా దాడి చేయడంతో యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ కేసులో పోలీసులు నారాయణస్వామిని అదుపులోకి తీసుకుని పుదుచ్చేరి జైలుకు తరలించారు. సుమారు మూడేళ్ల పాటు పుదుచ్చేరి జైల్లో ఉన్న నారాయాణస్వామికి బెయిల్ రావడంతో గత కొన్నిరోజులుగా ప్రతి రోజూ యానాం పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేస్తున్నాడు. నారాయణస్వామి యానాం రావడాన్ని గమనించిన మోకా వెంకటేశ్వరావు తనయుడు నారాయణస్వామిని హత్య చేయడానికి పథకం వేశాడు. శనివారం సాయంత్రం యానాంలో సినిమా థియేటర్ ఎదురుగా నారాయణస్వామిని విచక్షణా రహితంగా కత్తితో 10సార్లు పైగా పొడిచి ఆనంద్ పరారయ్యాడు. రక్తపు మడుగులో కొనఊపిరితో ఉన్న నారాయణస్వామిని స్థానికులు, సమీపంలో ఉన్న పోలీసులు ఆటోలో యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. తన తండ్రిని హత్య చేసినందుకే ఆనంద్ ప్రతీకార హత్య చేసినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఘటనా ప్రాంతాన్ని యానాం ఎస్పీ వరదరాజన్ పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్వేదిలో ప్రముఖుల పూజలు


సినీ నటుడు సునీల్‌కు ప్రసాదం అందిస్తున్న అర్చకులు


తెలంగాణ హైకోర్టు జడ్జి మాధవికి చిత్రపటం అందజేస్తున్న ఏసీ ప్రసాద్


ఆలయంలో టీటీడీ వైఖానస ఆగమ కమిటీ సలహాదారు అనంతశయాన దీక్షితులు

అంతర్వేది, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పలువురు ప్రముఖులు పూజలు నిర్వహిం చారు. సినీ నటుడు సునీల్ ఆలయానికి విచ్చేయగా అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో స్వామిని దర్శించుకున్న సునీల్‌కు వేదపండితులు మహాదాశీర్వచనం అందించారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే ఆలయానికి తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవి కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం చేసుకున్న వారికి వేద పండితులు మహదాశీర్వచనం అందజేశారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ అందజేశారు. అలాగే ఆలయా నికి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ కమిటీ సలహాదారు అనంతశయాన దీక్షితులు విచ్చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న ఆయనకు వేద పండితులు మహదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం అందించినట్టు ఆలయ ఏసీ ప్రసాద్ తెలిపారు.

రత్నగిరిపై హరిహరసదన్ కాటేజీకి రూ.5 లక్షల విరాళం

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన హరిహరసదన్ కాటేజీకి ఒక గది డోనార్ స్కీం కింద శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన కె.శ్రీనివాస్ రూ.5 లక్షలు విరాళంగా ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవుడి సన్నిధిలో ఉమ్మడి జిల్లా న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.


ఆలయంలో వేదాశీర్వచనం పొందుతున్న న్యాయమూర్తి సునీత


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

అన్నవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తోడ్కొని తూర్పురాజగోపురం తీసుకునివచ్చారు. ప్రత్యేకపూజల అనంతరం బాజాభజంత్రీలు, మేళతాళాల నడుమ ముమ్మరు ప్రదక్షిణ గావించారు. తర్వాత హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

అక్రమంగా పశువుల తరలింపు
వాహనం స్వాధీనం

గొల్లప్రోలురూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 216వ జాతీయ రహదారి కాకినాడ జిల్లా చేబ్రోలు జంక్షన్ వద్ద గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పిఠాపురం నుంచి తునికి బొలెరో వాహనంలో తరలిస్తున్న ఐదు పశువులను గుర్తించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కరప మండలం అరటకట్టకి చెందిన డ్రైవర్ సత్తి శివరామకృష్ణను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పంటబోదెలో పడి వ్యక్తి మృతి

ఉండ్రాజవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని తాడిపర్రు గ్రామానికి చెందిన కోడూరి వెంకట్రావు (66) ప్రమాదవశాత్తు రోడ్డుపక్కన పంటబోదెలో పడి మృతి చెందినట్టు ఎస్ఐ డి.రవికుమార్ శనివారం తెలిపారు. వెంకట్రావు గురువారం మధ్యాహ్నం తాడిపర్రు నుంచి తణుకుకు మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం వెంకట్రావు అల్లుడు అక్కిన బాపిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉండ్రాజవరం నుంచి తాడిపర్రు వెళ్లే రోడ్డుపక్కన పంటబోదెలో దుర్వాసన వస్తుందని పక్కచేను రైతు బోదెలో చూడగా వెంకట్రావు మృతదేహం కనిపించింది. బాపిరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మహిళను గాయపరిచిన వ్యక్తిపై కేసు

పెరవలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం జాతీయ రహదారి ఖండవల్లి వద్ద మహిళపై వ్యక్తి దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంక టేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు మండలం వేల్పూరుకు చెందిన బండారు పున్నమ్మ ఈ నెల 9న రాత్రి ఖండవల్లి వద్ద ఆటో కోసం నిల్చొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమెతో గొడవపడి జుట్టుపట్టుకుని చాకుతో గాయపర్చాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పున్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

హుస్సేన్‌పురంలో చోరీ

సామర్లకోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామ కెనాల్ రోడ్డులో నిత్యావసర వస్తువులు విక్రయించే రెండు దుకాణాల ఇనుప తలుపులు పెకిలించి సామగ్రిని దొంగలు చోరీ చేశారని దుకాణ యజమానులు పుప్పాల వెంకట్రావు, ఆశపు కృష్ణ సామర్లకోట పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వెంకట్రావు దుకాణంలో సుమారు రూ.1.30 లక్షల విలువైన నిత్యావసరాల సరుకులు, కృష్ణ దుకాణంలో సుమారు రూ.70 వేల విలువైన నిత్యావసరాల సరుకులు చోరీకి అయినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు పేర్కొన్నారు.

దోసకాయపల్లిలో ఘోర అగ్నిప్రమాదం
3 పాకలు, 2 గడ్డి వాములు దగ్ధం
40 మేకలు, ఒక గేదె దూడ సజీవదహనం



అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన ఇళ్లు, కాలిపోయిన మేకలు

కోరుకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసకాయపల్లిలో శనివారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. జుత్తుక రామలక్ష్మికి చెందిన 2పాకలు కాలిపోగా వాటిలో ఉన్న 40 మేకలు, ఒక గేదె దూడ సజీవ దహనం అయ్యాయి. అదే విధంగా గరికపాటి సత్తిబాబుకు చెందిన మరొక పాక, పుట్టా శ్రీనుకు చెందిన మూడు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10.30గంటల సమయంలో జుత్తుక రామలక్ష్మి, గరికపాటి సత్తిబాబు పశువుల మేత కోసం గడ్డి కోయడానికి పొలానికి వెళ్లారు. అయితే రామలక్ష్మి కూతురు ఇంట్లో టీవీ చూస్తుండగా ఒక్కసారిగా పొగలు వ్యాపించడంతో బయటకు పరుగులు తీసింది. ముందుగా పాకల నుంచి గడ్డివాములకు మంటలు అంటుకున్నాయి. ఒక పాకలో మేకలన్నీ కట్టేసి ఉండటం వల్ల అవి తప్పించుకోవడానికి వీలు లేకుండా సజీవ దహనం అయ్యాయి. ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అని కొందరు, గ్యాస్ సిలిండర్ పేలడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని మరికొందరు చెప్తున్నారు. నష్టం భారీగా జరిగింది. కూలీ పని చేసుకుని మేకలు మేపుకుంటున్న రామలక్ష్మి కుటుంబం వీధినపడింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు, సర్పంచ్ ధారా యశోదమ్మ, ధారా రాంబాబు, కూటమి నాయకులు, సీఐ సత్యకిషోర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గుంతలో దిగబడిన ఇసుక లారీ
అంతర్‌రాష్ట్ర రహదారిపై ట్రాఫిక్ జామ్



ఎటపాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దులోని భద్రాచలం-చర్ల అంతర్‌రాష్ట్ర ప్రధాన రహదారిపై చింతల గూడెం వద్ద ఇసుక లారీ గుంతలో దిగబడి పోయింది. ఈ ప్రధాన రహదారిపై ఇసుక లారీ అడ్డుగా మారడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. శనివారం సాయంత్రం చర్ల వైపు నుంచి ఇసుక లోడ్‌తో భద్రాచలం వైపు వస్తున్న లారీ చింతల గూడెం ప్రధాన రహదారిపై ఉన్న గోతిలో కూరుకుపోయింది. దీంతో సుమారు 2 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. రాత్రి 9 గంటలకు క్రేన్ సాయంతో లారీని తొలగించే ప్రయత్నం చేశారు.

అయినాపురంలో తాచుపాము హల్‌చల్


పామును బంధిస్తున్న గణేష్‌వర్మ

ముమ్మిడివరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అయినాపురంలోని ఓ ఇంటి వంట గదిలోకి తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. మట్ట శ్రీనివాస్ ఇంట్లోకి 4 అడుగుల పొడవుగుల గోధుమతాచు ప్రవేశించింది. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో గణేష్‌వర్మ సంఘటనా స్థలానికి చేరుకుని పామును బంధించాడు. తాచుపామును జనసంచారంలేని సురక్షిత ప్రదేశం విడిచిపెట్టనున్నట్టు తెలిపారు.

ఉధృతంగా గోదావరి...
గండిపోశమ్మ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలోని గొందూరు గ్రామంలో ఉన్న శ్రీ గండిపోశమ్మ అమ్మ వారి దర్శనాలు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. దర్శనానికి అనుమతించే తేదీ ప్రకటించే వరకు అమ్మవారి ఆలయ పరిసరాలకు ఎవరూ రావద్దని కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఇళ్ల మధ్య మురుగు నీరు


పిఠాపురంలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు

• దుర్గంధపూరిత వాతావరణంతో ఇక్కట్లు

పిఠాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఇళ్ల మధ్య నిలిచిపోతున్న వర్షపు, మురుగునీటితో పిఠాపురం పట్టణంలోని 2,3,4 వార్డుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం చిన్న వర్షం కురిసినా రహదారులు, ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోతోంది. దీంతో మురుగునీరు పోయేందుకు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు అక్కడే ఉండిపోతుంది. దీంతో ఈ ప్రాంతాలన్నీ దుర్గంధపూరితంగా మారడంతోపాటు దోమల బెడద అధికంగా ఉంటోందని అక్కడి ప్రజలు తెలిపారు. దీనివలన తాము తరచూ రోగాల బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైన్లు నిర్మించాలని, ఎక్కడ మురుగు, వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని వారు తెలిపారు. తక్షణం మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రేపు పిఠాపురంలో పీజీఆర్ఎస్

పిఠాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో ఈనెల 13వ తేదీ సోమవారం ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పాడా ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు తెలిపారు. ఈ పీజీఆర్ఎస్‌కు పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన అన్నిశాఖల డివిజన్, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన ఆదేశించారు. పీజీ ఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలు, ఇబ్బందులపై అర్జీలు ఇవ్వవచ్చునని చెప్పారు. నేరుగా హాజరు కాలేనివారు ఆన్‌లైన్‌లో తమ ఫిర్యాదులు, వినతులు నమోదు చేయవచ్చునని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

13 నుంచి 16 వరకు మంచినీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 11(ఆంధ్ర జ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు మంచినీటి సరఫరాకు అంతరాయ కలుగుతుందని నగర ప్రజలు సహకరించాలని ఇంజనీరింగ్ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్‌కు వచ్చే రా వాటర్ 1500 ఎంఎం మెయిన్ లైన్ లీక్ కావడంతో పైప్ లైన్ లీకేజీలు రిపేర్లు నిమిత్తం ఈనెల 13 ఉదయం నుంచి 16వ తేదీ సాయంత్రం వరకు మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు 17వ తేదీ ఉద యం నుంచి మంచినీటి సరఫరా యథావిధిగా ఇస్తారని పేర్కొన్నారు. శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచినీటి సరఫరా జరుగు రిజర్వాయర్లు శశికాంత్‌నగర్, శ్రీవిద్య కాలనీ(డీమార్టు), భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్ పరిసర ప్రాంతాలు, శ్రీనివాస బ్యాం కు కాలనీ, శానిటరీ సర్కిల్ 1 నుంచి 13, 49, 50 వార్డులు ఏరియా పరిధిలో ఉన్న ప్రజలు ముందస్తుగా మంచినీటిని నిల్వ చేసుకుని నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. మంచినీరు అవసరమైతే నీటి సరఫరా ట్యాంకర్లు ద్వారా సరఫరా చేయడానికి 6301387834, 7382042977, 9948022954, 9059296885లో సంప్రదించాలన్నారు.

'మద్యాన్ని ఆదాయ వనరులుగా చూస్తున్నారు'

పిఠాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యాన్ని విస్మరించి మద్యాన్ని ఆదాయ వనరులుగా ప్రభుత్వాలు చూస్తున్నాయని మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కన్వీనర్ డాక్టర్ ఎన్. సూర్యనారాయణ విమర్శించారు. మద్యం పాలసీ విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరి ఒకేవిధంగా ఉందని దీనిని తాము ఖండిస్తున్నామని తెలిపారు. ఆదాయమార్గంగానే మద్యాన్ని పరిగణించడంతో కల్తీ మద్యం విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజల మానప్రాణాలకు ముప్పు తెచ్చే మద్యాన్ని విక్రయించడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. సంపూర్ణ మద్యపాన నిషేదం అమలుచేయాలని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలఫలితాలు కనిపిస్తాయన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

తాళ్లరేవు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చొల్లంగిపేట ఈడీసీ కమిటీ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ ఇటీవల మరణించిన విజయదుర్గ కుటుంబానికి ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ వరప్రసాదరావు ఆదేశాల మేరకు ఫారెస్ట్ అధికార్లు రూ.10.000లు బాధితుడు సన్యాసిరావుకు ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈడీసీ చైర్మన్ సత్యనారాయణ, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీతో ప్రతీ కుటుంబం లబ్ధిపొందాలి

• ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సామర్లకోటలో జీఎస్టీ తగ్గింపుపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప, కాకినాడలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే వనమాడి

పెద్దాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీతో ప్రతీ కుటుంబం లబ్ధిపొందాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట నిర్వహించిన క్యాంపెనింగ్ కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల అన్నివర్గాల ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు అందుతున్నాయన్నారు. ఈ విషయాలను పార్టీ నాయకులు, అధి కారులు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు కలగడమే కాకుండా వ్యాపారాలు ఊపందుకుంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల అన్నివర్గాల ప్రజలకు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు అందుతాయన్నారు. పార్టీ నాయకులు, అధికారులు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ప్రయోజనం

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జీఎస్టీ 2.0 తగ్గింపు ప్రజలందరికీ మరింత ప్రయోజనం కలుగుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. శనివారం సామర్లకోటలో వాణిజ్య పన్నులశాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప జీఎస్టీపై వాణిజ్య పన్నుల శాఖ ముద్రించిన కరపత్రాలను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్(బాబు), బలుసు శ్రీనివాసు, బొందల రామలక్ష్మి పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో పన్నుల వ్యవస్థ సులభతరం

కాకినాడ సిటీ(ఆంధ్రజ్యోతి): పన్నుశ్లాబులను తగ్గించి, నిత్యావసర వస్తువులపై భారాన్ని తగ్గించడం ద్వారా పన్నుల వ్యవస్థను సులభతరం చేయడమే నూతన జీఎస్టీ 2.0 సంస్కరణల ముఖ్య ఉద్దేశమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్‌సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన స్థానిక భానుగుడి సెంటర్‌లో పర్యటించి స్థానిక వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, బచ్చు శేఖర్, గదుల సాయిబాబా, గుమ్మళ్ల వెంకటేశ్వరరావు, వీరంరెడ్డి వెంకటలక్ష్మి, అంబటి చిన్న, సుంకర శ్రీను, మూడే రాజుబాబు, కేలంగి ప్రసాద్, పల్లా సురేష్, సురేష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిర్దేశించిన ప్రాంతాల్లోనే బాణసంచా విక్రయించాలి

• పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన ప్రాంతాల్లోనే బాణాసంచా అమ్మకాలు సాగించాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ స్పష్టం చేశారు. అనుమతిలేని చోట్ల అమ్మకాలు సాగిస్తే సరుకు సీజ్‌చేయడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిఠాపురంలోని సర్కిల్ కార్యాలయంలో బాణసంచా విక్రయించే దుకాణదారులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. రహదారులపై బాణసంచా కాల్చేవారిపై కఠినచర్యల తీసుకుంటామని తెలిపారు. దుకాణాలవద్ద అన్నిరకాల అగ్నిమాపక నివారణ సామగ్రి అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీరు ఉండాలని తెలిపారు. లైసెన్సు లేకుండా ఎవరు విక్రయాలు జరిపినా, అక్రమంగా నిల్వ ఉం చినా చర్యలు తప్పవన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంవలన ప్రమాదాలు జరిగితే దుకాణదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్ఐలు పాల్గొన్నారు.

తనిఖీలలో అధికారుల నిమగ్నం

సామర్లకోట(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ యూనిట్లు, బాణసంచా విక్రయశాలలు నిర్వహణలో నిబంధనలను కఠినం చేస్తూ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలు జారీ చేశారు. రాయవరం వద్ద మూడు రోజుల క్రితం జరిగిన బాణసంచా తయారీ యూనిట్‌లో పేలుళ్లలో ఎనిమిది మంది కార్మికులు మృతిచెందిన విషయం విదితమే. ఈ మేరకు శనివారం సామర్లకోట మండలంలో హుస్సేన్ పురం, వేట్లపాలెం, జీ.మేడపాడు, సామర్లకోటలో నాలుగు తయారీ యూనిట్లు, మూడు విక్రయ దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, సీఐ కృష్ణభగవాన్, అగ్నిమాపకదళాధికారి శ్రీహరిజగన్నాథ్, యాకూబ్‌ఖాన్, వీఆర్వోలు కామరాజు, కొండలరావు, రాఘవ, మండా వెంకట సుబ్బారావు, బాణసంచా తయారీదారులు పాల్గొన్నారు


కాకినాడలో బాణసంచా వ్యాపారులకు దిశా నిర్దేశం చేస్తున్న సీఐ

బాణసంచా విక్రయదారులతో పోలీసుల సమీక్ష

కాకినాడ క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడలో గతేడాది బాణసంచా విక్రయించిన వ్యాపారులతో త్రీటౌన్ సీఐ కేవీవీ సత్యనారాయణ శనివారం నియమ నిబంధనలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బాణసంచా దుకాణం పెట్టుకునే ప్రతి ఒక్కరూ సంబంధిత డిపార్ట్‌మెంట్‌ల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే షాపుల యజమానులపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అనుమతుల కోసం చివరినిమిషం వరకు వేచి ఉండకుండా ముందస్తుగానే అనుమతులు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ కింద ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా షాపుకి షాపుకి మధ్య తగిన దూరం పాటించాలన్నారు. షాపుల్లో వృద్ధులకుగాని, మహిళలనుగాని ఉంచకుండా 18ఏళ్లు దాటిన యువకులను మాత్రమే పెట్టుకోవాలని, అలాగే ఎటువంటి అగ్ని ప్రమాదానికి తావు లేకుండా ఫైర్ ఎక్సిటింగ్విషర్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. గత సంవత్సరం విక్రయాల తరువాత మిగిలిన బాణసంచాను వారి ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచితే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయడంగాని అక్రమంగా నిల్వ ఉంచడంగాని ఎవరు దృష్టికైనా వస్తే 94407 96542, 08842379052 నెంబర్లలో తెలియపర్చడం ద్వారా అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించ వచ్చన్నారు.

టెక్‌డేటాతో కైట్ అవగాహన ఒప్పందం


సంతకాలుచేసిన ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న టెక్‌డేటా, కైట్ ప్రతినిధులు

కాకినాడరూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని టెక్ డేటాతో కైట్ ఇంజనీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రేవతి తెలిపారు. కైట్ విద్యార్థులకు శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో టెక్‌డేటా సీఈవో కె.శివ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత సాంకేతిక రంగంలోగల అవకాశాలు, ఏఐ,డేటా సైన్స్ మెషీన్‌లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ పై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం కైట్, టెక్‌డేటా ప్రతినిధులు సంతకాలు చేసిన ఎంవోయూ పత్రాలను సీఈవో కె.శివ, కైట్, రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ పోతుల విశ్వం శ్రీమహావిష్ణు, డైరెక్టర్ పి.ఐశ్వర్య ఒకరికొకరు మార్చుకున్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ రామ్‌కిరణ్, గోపి పాల్గొన్నారు.

సామాజిక స్థలాల పరిరక్షణకు చర్యలు


సామాజిక స్థల రక్షణకు కొలతలు వేయిస్తున్న కార్యదర్శి పాండు రంగారావు

సర్పవరంజంక్షన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వాకలపూడి గ్రామ పంచాయతీ పరిధిలో 118 సామాజిక స్థలాలు ఉన్నట్లు గుర్తించామని, వీటి సంరక్షణ కు చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ కార్యదర్శి పిడుగు పాండు రంగారావు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో ఎంఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ పరిధిలో గల పలు సామా జిక స్థలాలను గ్రామ సర్వేయర్, సిబ్బందితో కలసి గుర్తించి, సర్వే నిర్వహించి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. సామాజిక స్థలాల నాలుగు మూలల గోడలు నిర్మించామన్నారు. ఎల్‌పీ నెంబర్, విస్తీర్ణం, ఆక్రమిస్తే శిక్షార్హులు అని హెచ్చరికలు రాయిస్తామన్నారు. గ్రామంలో 118లేఅవుట్లు, 15 టీడీసీపీ లేఅవుట్‌లు ఉన్నాయన్నారు. వీటిలో ముందుగా డీటీసీపీలో పంచాయతీకి దాఖలు చేసిన సామాజిక స్థలాల రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామ సర్వేయర్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు. కార్యదర్శి పాండు రంగారావును గ్రామస్థులు అభినందించారు.

'జర్నలిజంలో అప్పారావు సేవలు మరువలేనివి'


జర్నలిస్టు అప్పారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాత్రికేయులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): జర్నలిజంలో సీనియర్ జర్నలిస్టు అడపా అప్పారావు సేవలు మరవలేనివి అని పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. కాకినాడ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో సీనియర్ జర్నలిస్టు అడపా అప్పారావు సంస్మరణ సభ శనివారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అప్పారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అప్పారావు పేరు మీదుగా ప్రతిఏటా విద్యార్థులకు, పాత్రికేయులకు నగదు పురస్కారాలు అందజేస్తామని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అంజిబాబు, సీనియర్ జర్నలిస్టులు స్వాతిప్రసాద్, ఎండీకే దుర్రాని, శివన్నారాయణ రెడ్డి, బొడ్డు వెంకటరమణ, వాడ్రేవు శ్రీనివాసు, సాంబశివరావు, ఎల్.శ్రీనివాసు, శివరామకృష్ణ, జిల్లాలలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

సామర్లకోట పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన

• ఎమ్మెల్యే రాజప్ప


28వ వార్డులో డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధి సాధించలేకపోవడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.10కోట్ల నిధులతో రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట పట్టణంలో 28వవార్డులో రూ. 9లక్షల నిధులతో డ్రైన్ల నిర్మాణపనులకు ఎమ్మెల్యే చినరాజప్ప కొబ్బరికాయ కొట్టి శనివారం శ్రీకారం చుట్టారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్(బాబు)ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక పెద్దాపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంతో జరుగుతున్నందున ప్రజలు ముందుకు వచ్చి మరింత అభివృద్ధికి సూచనలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బలుసు శ్రీనివాసు, దేవళ్ల జయలక్ష్మి, పైణ్ణిశ్రీనివాసు, బొందల రామలక్ష్మి, మలిరెడ్డి ప్రసాద్, గొలితి సత్యనారాయణ, సరోజా వాసు తదితరులు పాల్గొన్నారు.

శాలివాహనుల అభివృద్ధికి కృషి


శాలివాహనుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేషన్ చైర్మన్

• సంఘ చైర్మన్ ఈశ్వర్

సామర్లకోట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కులవృత్తిదారుల ఆర్థికస్థితిగతులు మరింత పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నందున ప్రభుత్వ పథకాలు శాలి వాహనులు సద్వినియోగం చేసుకోవాలని శాలి వాహన వెల్ఫేర్, డవలప్‌మెంట్ చైర్మన్ పి. ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం సామర్లకోట, పెద్దాపురంలో కుమ్మరవీధిలలో పర్యటించి శాలివాహనకులస్థుల ఆర్థిక స్థితిగతులు పరిశీలించారు. ప్రాంతాల వారీగా శాలివాహనులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతానన్నారు.

స్వదేశీ ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలి

• బీజేపీ ఇన్‌చార్జి గండి కొండలరావు


గొల్లప్రోలులో స్వదేశీ ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

గొల్లప్రోలు, అక్టోబరు 11 ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తులకు ప్రజలు తగిన ప్రోత్సాహం అందించాలని బీజేపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి గండి కొండలరావు కోరారు. ఆత్మ నిర్భర్ భారత్ అభియా న్‌లో భాగంగా గొల్లప్రోలులో శనివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వదేశీ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగుమతులపై ఆధారపడటం తగ్గిం చి దేశీయంగా అన్నిరకాల ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు డీవీఎస్ రాజు, సైతన సత్యకుమారి, పడాల శ్రీను, కర్రి సత్యనారాయణ, అడపా మోహన్, చీపూరి భాస్కరరావు, ముడదా మార్తమ్మ, కోశెట్టి అడవిరాజు, మేడసాని కామరాజు, వియ్యపు రాములు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు దోహదం



ట్రయనింగ్, ప్లేస్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభిస్తున్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో నాణ్యమైన శిక్షణ ఇవ్వడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు దోహదం చేస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తెలిపారు. శనివారం సర్పవరం జంక్షన్‌లో జగ్గారవు గణేష్ ఆధ్వర్యంలో ఏకలవ్యా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ట్రైనిం గ్ అండ్ ప్లేస్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, నిరుద్యోగ యువతకు శిక్షణా అవకాశాలు కల్పించి, వారి ఉన్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. నండూరి సత్తిబాబు, బొలిశెట్టి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి


పిఠాపురం సీఐ, ఎస్ఐలను కలిసిన ఆటో యూనియన్ ప్రతినిధులు

పిఠాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలు పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం పట్టణంలోని ఆటో యూనియన్‌లు కలిపి నూతనంగా ఏర్పాటు చేసుకున్న యూనియన్ల ప్రతినిధులు శనివారం సీఐ, పట్టణ ఎస్ఐ మణికుమార్‌లను కలిశారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. యూనియన్ల అందరు సోదరభావంతో మెలగాలని తెలిపారు. కొందరు వ్యవహరిస్తున్న తీరుతో మొత్తం ఆటో డ్రైవర్లు, యజమానులకు చెడ్డపేరు వస్తోందని, దీనిని గమనించుకోవాలన్నారు. పట్టణంలోని ఆలయాలవద్ద ఇతర ప్రాంతా ల నుంచి వచ్చే భక్తుల పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించినా, దండా చేయాలని చూసినా సహించబోమని స్పష్టం చేశారు. సీఐ, ఎస్ఐలను కలిసిన వారి లో పట్టణ ఆటో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలివెల గోవిందు, కన్నాబత్తుల విజయకుమార్, ఉపాధ్యక్షుడు ఏసుదాసు, గౌరవ అధ్యక్షుడు మంజునాథ్, బచ్చల శ్రీనివాస్, గుల్ల విజయభాస్కర్, కోశాధికారి షేక్‌నాయబ్ బాషా తదితరులు ఉన్నారు.

స్వర్ణ సంచాయతీ సాఫ్ట్‌వేర్ ఎర్రర్స్‌తో జీతాల చెల్లింపులకు ఇబ్బందులు

• పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల ఆవేదన

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఈనెల జీతాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తాజాగా జీతాల చెల్లింపులను కొత్త స్వర్ణ పంచాయతీ సాఫ్ట్‌వేర్ ద్వా రా చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సమస్యలు తలెత్తాయి. సెప్టెంబరులో ఈ ప్రక్రియ పూర్తి చేసి అక్టోబరు నుంచి పంచాయతీ కార్యదర్శులు ఆసాఫ్ట్‌వేర్‌లో వివరాలు అప్‌లోడ్ చేసి జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇబ్బంది. సాఫ్ట్‌వేర్‌లో అప్లోడ్ చేస్తున్న సమయంలో తరచూ ఎర్రర్లు రావడంతో బిల్లులు ముందుకు సాగడంలేదు. ఫలితంగా జీతాల చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో పలు పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులు వారు కట్టుకోవాల్సిన వాయిదాలు, కుటుంబ ఖర్చులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల కార్మికులు జీతాలు రాకపోతే పనులు ఆపేస్తామని హెచ్చరిస్తుండగా కార్యదర్శులు వారిని సముదాయిస్తూ సాఫ్ట్‌వేర్‌లో చిన్న సమస్య మాత్రమే ఉంది, త్వరలోనే జీతాలు వేస్తామని బుజ్జగిస్తున్నారు. స్వర్ణ పంచాయతీ సాఫ్ట్‌వేర్ పూర్తిస్థాయిలో డెవలప్‌కాకపోవడంతో బిల్లులు సీఎఫ్ఎంఎస్ దశకు వెళ్లడం లేదు. సాఫ్ట్‌వేర్ పూర్తిస్థాయిలో సిద్ధమైన తర్వాత సిబ్బందికి పూర్తి శిక్షణ ఇచ్చిన తర్వాతే దీన్ని అమలు చేస్తే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సంతకాలు సేకరణ

పెద్దాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని దానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి వంద మంది నుంచి సంతకాలను సేకరణ కార్యక్రమం చేపడుతున్నట్లు కేంద్ర రక్షణ శాఖ మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ జంక్షన్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో పెద్దఎత్తున ఓట్ల చోరీకి పాల్పడి కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుబంధ సంఘంలా పనిచేస్తుందన్నారు. అనంతరం పలువురి నుంచి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సత్యానందం, మలకల సూరిబాబు, తోట కరుణాకర్(సోని) తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రత్తిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఏర్పడింది. అధ్యక్షుడిగా ఎంవీ రమణ, ఉపాధ్యక్షుడిగా కె.సాయి గణేష్ నియమితులయ్యారు. అధ్యక్ష ఉపాధ్యక్షుల స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

14న ధారాలమ్మ జాతర



మోతుగూడెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):చింతూరు మండలం మోతు గూడెం, పొల్లూరు గ్రామాల మధ్యలో ధారాలమ్మ తల్లి కొలువై ఉంది. ఈరెండు గ్రామాల ప్రజలే కాకుండా చుట్టు పక్కల ఉన్న గ్రామాల నుంచి, సరిహద్దు నాలుగు రాష్ట్రాల నుంచి అనేకమంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్నారు. ఎటువంటి కష్టం, బాధలో ఉన్నా అమ్మ అంటూ శరణ కోరితే ధారాలమ్మ ప్రజలను కరుణిస్తుందని ప్రజల విశ్వాసం. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం 1970లో నిర్మాణం ప్రారంభించినప్పుడు కాంట్రాక్టర్ నీలపు కామేశ్వరమ్మ పొల్లూరు, మోతుగూడెం గ్రామాల మధ్యలో ధారాలమ్మ అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. అమ్మవారికి ఆమె దూప దీప నైవేద్యాలు సమర్పించేవారు. ఆమె తర్వాత కుమార్తె కిలుగు సావిత్రమ్మ, సావిత్రమ్మ తర్వాత ఆమె కుమారుడు, కోడలు వెంకటేశ్వరరావు మణి దంపతులు ఈబాధ్యతలు చేపట్టారు. దసరా మరుసటి మంగళవారం అమ్మవారికి జాతర జరిపించడం ఆనవాయితీగా వస్తుంది. ఈనెల14న అమ్మవారి జాతర నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ధర్మకర్తలు, పొల్లూరు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు జాతర నిర్వహణకు చర్యలు చేపట్టారు.

జూదాలు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ

ఎటపాక, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పండుగల ముసుగులో గ్రామాల్లో పేకాట, కోడిపందాలు, జూదాలు ఆడితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని సీఐ కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు హెచ్చరించారు. శనివారం పేకాట ఆడుతున్న పలువురుని బైండోవర్ చేశామని ఎస్ఐ తెలిపారు.

బాలికల సంరక్షణకు పాటుపడదాం



బాలిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న బాలికలు

ఎటపాక, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని తోటపల్లి శ్రీఆదిత్య స్కూల్ డైరెక్టర్ కడియాల వెంకట్ పేర్కొన్నారు.జాతీయ బాలిక దినోత్సవాన్ని పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. బాలికలు లక్ష్యాన్ని సాధించి ఉజ్వల భవిష్యత్ వైపు బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు మల్లికా, శ్రీనివాస్, అప్పాజీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చలో రంపచోడవరానికి ఆదివాసీలు తరలిరండి

దేవీపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం ఐటీడీఏ ముందు ఈనెల 13న జరిగే ర్యాలీ, ముట్టడి కార్యక్రమానికి ఆదివాసీలంతా తరలిరావాలని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం దేవీపట్నం ఆర్అండ్ఆర్ కాలనీ గొందూరులో జరిగిన సమావేశంలో శేఖర్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు జీవో 3ను పునరుద్ధరించి, మరో కొత్త జీవో ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగులకు వంద శాతం ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. తక్షణమే ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు చవలం విద్యాసాగర్‌దొర, మిర్తివాడ సూరారెడ్డి, మిర్తివాడ సాయికిరణ్ రెడ్డి, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ట్రాల్ ట్రైనింగ్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న ఎంఈవో

అడ్డతీగల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఈనెల6నుంచి నిర్వహిస్తున్న ట్రాల్ ట్రైనింగ్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు రమేష్, శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ఎవరైతే విద్యార్థులు తెలుగులో అక్షరాలు చదవడం, రాయలేకపోతున్నారో వారికి, గణితంలో అంకెలు, చతుర్విధ ప్రక్రియలు చేయలేకపోతున్నారో వారి కోసం రెండు దఫాలుగా ఆరు రోజులు ట్రాల్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈట్రైనింగ్‌లో 261మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారన్నారు. ఈ శిక్షణలో నేర్చుకున్న బోధనా పద్ధతులు పాఠశాల స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, డీపీఆర్ఎస్‌లు రాఘవులు, మురళీకృష్ణ మధు, కృష్ణ, సతీష్‌రెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

ముగిసిన ఆయుర్వేదిక్ శిక్షణ

అడ్డతీగల, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 2024 నవంబరులో ప్రారంభించిన కమ్యూనిటీ ఆయుర్వేద, సంప్రదాయ మూలిక వైద్య ప్రాక్టిషనర్ కోర్సు శనివారంతో ముగిసింది. మారుమూల ఆదివాసీ ప్రాంతాల్లో నాణ్యమైన ఆయుర్వేద వైద్యం ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి, చదువుతున్న ఆదివాసీ యువతకు జీవన నైపుణ్యం కల్పించాలనే ఉద్దేశంతో లయ సంస్థ సంవత్సరం అడ్డతీగల వనంతరంలో నిర్వహించిన ఈకోర్సులో 24మంది యువత శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లు, మందులు తయారీ పరికరాలు అందుకున్నారు. ఇప్పటి వరకు 126మంది ఆదివాసీ యువత శిక్షణ పూర్తి చేసుకున్నట్లు లయ కోఆర్డినేటర్ జి.బుల్లియ్య తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడలకు 'లిట్స్' విద్యార్థులు



జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ ఏసురత్నం

చింతూరు, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): కాటుకపల్లిఅరూపే(లిట్స్) పాఠశాలలో చదువుతోన్న 23మంది విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో 12మంది బాలురు, 11మంది బాలికలున్నారు. శుక్ర, శని వారాలు రంపచోడవరం మండలం ములుసుమిల్లి పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. అరూపే పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు పరుగు పందెం, ఖోఖో, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర పోటీల్లో ప్రతిభ కనబర్చారు. విద్యార్థులను లిట్స్ డైరెక్టర్ ఏసురత్నం అభినందించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ సంతకాల సేకరణ

ప్రత్తిపాడు, జగ్గంపేటలో నిర్వహించిన కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు



ప్రత్తిపాడులో సంతకాలు సేకరిస్తున్న పళ్లంరాజు

ప్రత్తిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ సారథ్యంలో దేశవ్యాప్తంగా 5కోట్ల మంది సంతకాలు సేకరిస్తున్నట్టు కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పళ్లంరాజు చెప్పారు. ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం ఓటర్ల జాబితా అవకతవకలపై మహిళలు, స్థానికులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కళామందిర్ సెంటర్‌లో అంబేద్కర్‌కు పూలమాల వేసి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను బలహీనపరిచిందని ఆరోపించారు. అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగం ప్రకారం ప్రజలకు స్వేచ్ఛగా ఓటు హక్కు కల్పించాల్సి ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా ప్రజలకు జవాబు దారీగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సెప్టెంబరు 15నుంచి అక్టోబరు 15 వరకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ సంతకాల సేకరణకు అపూర్వ స్పందన వస్తుందన్నారు. ఓటర్లను తొలగించడం తగదని, ఫొటోలతో స్పష్టమైన ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు దర్నాల కోట శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుకొండ సత్యనారాయణలు ప్రసంగించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాష్, ఉమ్మిడి సురేష్, కొల్లు వీర గణేష్, దాసరి సత్తిబాబు, కందిమళ్ళ శామ్యూల్, వెలుగుల చక్రం, పాల్గొన్నారు. ధర్మవరంలో సంతకాల సేకరణ చేపట్టారు.

జగ్గంపేటలో...

జగ్గంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జగ్గంపేట ఇన్‌చార్జి మరోతి శివ గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పళ్లంరాజు ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఎన్నికల సంఘంపై పోరాడుతున్న రాహుల్ గాంధీకి మద్దతుగా ప్రజాభిప్రాయ సేకరణ సంతకాలు సేకరిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, మండలాధ్యక్షులు వత్సవాయి సత్యనారాయణ రాజు, గుర్రాల రత్నాజీ రావు, బుద్ధ యతిరాజులు, నేదురి భాస్కరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



ఎ.మల్లవరంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రౌతులపూడి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 1999-2000లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక శనివారం జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడిన సూమారు 80 మంది కలుసుకుని అప్పటి విషయాలను గుర్తుచేసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ పాఠశాల ప్రాగణంలో సంతోషంగా గడిపారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గైరమ్మ వేషాలు ప్రారంభం



తిరుపతి కుటుంబ యాత్ర కళా ప్రదర్శన దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో గౌరీశంకర్ల 89వార్షికోత్సవం మహోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి గైరమ్మ వేషాలు కళాకారులు ప్రారంభించారు. తిరుపతి కుటుంబ యాత్ర అనే కళారూపకాన్ని ప్రదర్శించారు. కుటుంబ పెద్దగా బలిజ వీర్రాజు, సభ్యులుగా బిట్టు లోవరాజు, చెన్నాడ వెంకటరమణ, అళ్ళ మణికంఠం, దండ అనీల్‌కుమార్, విశ్వం గణేష్ నటించారు.

గంగాస్వామి విగ్రహావిష్కరణ

గండేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో మేడిబోయిన గంగాస్వామి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. సీఆర్పీఎఫ్ 219 బెటాలియన్‌కి చెందిన మేడిబోయిన గంగాస్వామి 2016లో మరణించారు. గంగాస్వామి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, మిత్రుల సహకారంతో పంచాయతీ వద్ద స్థలం కేటాయించగా విగ్రహావిష్కరణకు రైల్వే రిటైర్డు ఉద్యోగి జనసేన నాయకులు సత్తి సోమరాజు సహాయ సహకారాలు అందించారు. సీఆర్పీఎఫ్ 42 బెటాలియన్ కమాండెంట్ ధర్మప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహావిష్కరణ చేశారు. గంగాస్వామి విద్యనభ్యసించిన పాఠశాలలో మెరిట్ విద్యార్థుల ప్రోత్సాహం కోసం రూ.10వేల నగదును సొసైటీ బ్యాంకులో డిపాజిట్ చేసి చెక్కును ప్రధానోపాధ్యాయుడికి అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ దీపక్‌కుమార్, డాక్టర్ నితిన్ ఝుాల్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ సి.వెంకన్న, నరం శివగణేష్, పిల్లి ప్రభాకర్, బొమ్మన రాజేశ్వరరావు బృందం, తోరాటి వెంకన్న, తమటం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు భక్తుల పాదయాత్ర

ప్రత్తిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధానానికి ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన అయ్యప్ప భక్తులు శనివారం పాదయాత్ర చేపట్టారు. శివాలయం వద్ద నుంచి ఐదుగురు అయ్యప్ప మాల దీక్షాపరులు పోకనాటి రాఘవేంద్ర, సతీష్, రాజశేఖర్, నానాజీ గురుస్వామి, అర్జున్, సింహాద్రిపురం నుంచి ఈశ్వరుడు గురుస్వామి బృందం పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర స్వాములకు గురుస్వాములు బొల్లు గంగాధర్, అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు నూతన జాతీయ అధ్యక్షుడు చంటి గురుస్వామి బృందాలు వారికి శాలువా కప్పి సన్మానించారు.

నేడు నీటిపారుదల పథకానికి శంకుస్థాపన

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో రూ.3 కోట్ల 49 లక్షలతో శ్రీ జ్యోతుల పాపారావు నీటిపారుదల పథకం శంకుస్థాపన మహోత్సవం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలియజేశారు. శనివారం సాయంత్రం మామిడాడలో శంకుస్థాపన చేసే ప్రాంతం వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం నెహ్రూ మాట్లాడుతూ ఇర్రిపాక, మామిడాడ, నరేంద్రపట్నం, కాండ్రేగుల, గొల్లలగుంట, మర్రిపాక గ్రామాలకు సంబంధించిన 3500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఈ పథకం ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారని పేర్కొన్నారు. శంకుస్థాపన అనంతరం రైతులతో సభ నిర్వహిస్తామన్నారు.

పెదశంకర్లపూడిలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



పెదశంకర్లపూడిలో ఆర్ఎస్ఎస్ కవాతు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు



గోనేడలో నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల దృశ్యం

ప్రత్తిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ నూరు వసంతాల ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు శనివారం సాయంత్రం కవాతు నిర్వహించారు. తొలుత ఆయుధ పూజ, భరతమాత, డాక్టర్‌జి, గురుజి చిత్రపటాలకు పూజలు చేసి సంఘ ధ్వజానికి ప్రణామాలు సంఘ ప్రార్థన చేశారు. అనంతరం వ్యాయామాలు నిర్వహించారు. కార్యక్రమంలో లీలా శంకర్, ఎల్లపు సూర్యనారాయణ, జువ్విన వెంకటేశ్వరరావు, కర్రి ధర్మరాజు, రాసంశెట్టి రాజా, కందా వీరాస్వామి, రాసంశెట్టి సుబ్బారావు, రెడ్డి శేఖర్, మండల స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

గోనేడలో...

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేడ గ్రామ శివాలయంలో బీజేపీ నాయకులు, ఎంపీటీసీ అల్లు శివరామకృష్ణ అధ్యతన ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు నిర్వహించారు. తోట సర్వారాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్‌వివి సత్యలింగేశ్వరరావు, ఎంవివి రమణ పాల్గొని మాట్లాడారు. డాక్టర్ హెగ్డేవార్, గురూజీ, భారతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి కాషాయ ధ్వజాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో శరకణం రాజబాబు, యడాలి రాంబాబు, కంటా కాశీవిశ్వనాథం, గోకాడ రాజబాబు పాల్గొన్నారు.

బస్సు ఆపలేదని డ్రైవర్‌ను నిలదీసిన ప్రయాణికులు



మల్లేపల్లిలో డ్రైవర్‌ను నిలదీస్తున్న ప్రయాణికులు

గండేపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బస్టాప్‌లో బస్సు ఆపలేదని మల్లేపల్లి గ్రామంలో శనివారం డ్రైవర్‌ను ప్రయాణికులు నిలదీశారు. స్థానికుల సమాచారం ప్రకారం... రాజమండ్రి నుంచి తుని వెళ్తున్న ఆర్టీసీ బస్సు గండేపల్లి బ స్టాప్‌లో ఆపకుండా మల్లేపల్లి బస్టాప్‌లో ఆప డంతో గండేపల్లి నుంచి వెనుకే వచ్చిన ప్రయాణికులు తాము బస్సు కోసం చాలా సమయం నుంచి ఎదురుచూస్తుంటే అక్కడ ఆపకుండా ఇక్కడ ఎందుకు ఆపారని డ్రైవర్‌ను ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన దగ్గర నుంచి ప్రయాణికులతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయని, బస్టాండ్‌లోనే బస్సులు ప్రయాణికులతో నిండిపోతున్నాయని అందుకే ఆపడంలేదని పలువురు అంటున్నారు. అయితే జాతీయరహదారిని ఆనుకుని ఉన్నవారు ఆయా గ్రామాల వద్ద బస్సులు ఆపకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తునిలో ఘనంగా జాతీయ పోస్టల్ దినోత్సవం



పోస్టాఫీసు సేవలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తుని రూరల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): తునిలో జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. స్కూల్ విద్యార్థులతో కలిసి పోస్టల్ సేవలపై తుని పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టుమాస్టర్ నాగరాజు మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్‌లో ఉత్తరాలతో పాటు ప్రజలు బ్యాంకింగ్ సేవలు కూడా సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం పోస్టల్ డిపార్టుమెంట్ ద్వారా అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తుని పట్టణంలో పలు స్కూల్స్ విద్యార్థులు పోస్టాఫీసు సేవలు అందిస్తున్న సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగకుమారి, విద్యార్థులు, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



తొండంగి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బెండపూడి శివారు తమ్మయ్యపేటలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కత్తిపూడి రిఫరల్ ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ వజ్రాణి, డాక్టర్ విష్ణు, పి.సత్యనారాయణ, డి.సత్తిబాబు, పెయ్యల తాతాజీ, సాధనాల రాజు, పెయ్యల పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌లేకుండా బాణసంచా అమ్మితే చర్యలు



కోటనందూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) దీపావళిని పురస్కరించుకుని లైసెన్స్ లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ టి.రామకృష్ణ, తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. శనివారం కాకరాపల్లిలోని మణికంఠ బాణసంచా తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చర్యలు ఉంటాయన్నారు. దీపావళికి బాణసంచా అమ్మేవారు ముందుగా లైసెన్స్‌లు తీసుకోవాలని తెలిపారు.

దిశ కమిటీ సభ్యురాలిగా సరస్వతి

శంఖవరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దిశ కమిటీ సభ్యురాలిగా పెదమల్లాపురానికి చెందిన గిరిజన మహిళ జర్తా సరస్వతి ఎంపికయ్యారు. తన ఎంపికకు కారణమైన కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్‌ను శనివారం స్థానిక నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజన మహిళనైన తనను గుర్తించినందుకు కృతజ్ఞతలు తలిపారు. గిరిజన గ్రామాల్లో పార్టీ అభివృద్ధికి మరింత పనిచేస్తానని ఆమె తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు, ఎం.లక్ష్మణరావు, అర్జును, జర్తా సీత, ఆర్.రాజబాబు తదితరులు ఉన్నారు.



సరస్వతిని అభినందిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

లోవలో అటవీ శాఖాధికారి పూజలు

తుని రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో జిల్లా అటవీశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు ఆలయ పండితులు స్వాగతం పలికారు. ఆలయ ఈవో శేష వస్త్రంతో సత్కరించారు. వేదపండితులు, అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవోతో కలిసి పరిశీలించారు.

లోవరాజుకు ఆత్మీయ సత్కారం

తుని రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో సత్తా చాటి పెద్దాపురం రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా నియమితులైన తునికి చెందిన చల్లా లోవరాజును పలువురు ప్రముఖులు అభినందించారు. తుని టీడీపీ నాయకులు మోతుకురి వెంకటేష్, ఏపీసీఎస్ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, సూరంపూడి శేఖర్, వంగలపూడి నాగేంద్ర, వంగలపూడి వంశీ, తుమ్మలపల్లి నానిలు తునిలో లోవరాజును సత్కరించారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం



డిజేపురం- వేలంపేట రహదారిలో పక్కకు వాలిన విద్యుత్ స్తంభం

రౌతులపూడి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): డిజేపురం- వేలంపేట రహదారిలో విద్యుత్ స్తంభం పక్కకు వాలిన ప్రమాదభరింతంగా ఉంది. రహదారి మార్జిన్‌కు అనుకుని ఉన్న ఈ స్తంభం ఏ క్షణమైనా కూలిపోయే అవకాశం ఉంది. రౌతులపూడి నుంచి తుని, తలుపులమ్మలోవ వెళ్లేవారంతా ఈ రహదారి గుండానే ప్రయాణం చేస్తుంటారు. స్తంభం కూలితే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి వాలిన విద్యుత్ స్తంభాన్ని సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జగ్గంపేటకు ప్రచార రథం

జగ్గంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం కార్తీక మహోత్సవాలు ప్రచార రథం జగ్గంపేటకు చేరుకుంది. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, దేవస్థానం బోర్డు మాజీ సభ్యుడు కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ఘన స్వాగతం పలికి పోస్టర్ ఆవిష్కరించారు. మహోత్సవాలు ఈనెల 22 నుంచి నవంబర్ 20 వరకు వైభవంగా సాగుతాయని, భక్తులందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

గండేపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ కాలేజీలో ఈనెల 9న జరిగిన జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో సూరంపాలెంలోని ఆదిత్య విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబరిచి వక్తృత్వ పోటీల్లో ద్వితీయ స్థానం, కథా రచనలో తృతీయ స్థానం సాధించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరిచిన ఎబిబిఎస్ విద్యార్థి అమరేష్‌యాదవ్, దీపకను అభినందించారు. విద్యార్థులకు వివిధ సాంస్కృతిక విభాగాల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న డాక్టర్ టి.నీలిమకు అభినందనలు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన

ఆదిత్యలో లియో క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ఎన్.మహాలక్ష్మికుమార్ విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం, ఆత్మ పరిశీలన, వ్యక్తిత్వ వికాసం అంశాలపై సూచనలిచ్చారు.

గజ్జెనపూడిలో తాగునీటి ఇబ్బందులు

ప్రత్తిపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజ్జెనపూడిలో గత నాలుగు రోజులుగా తీవ్ర మంచినీటి ఇబ్బందులు వస్తున్నాయి. గ్రామంలో రక్షిత మంచినీ పథకం సక్రమంగా పని చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం ఏలేరు ఎడమ కాలువకు, పొలంలోని వ్యవసాయ బోరుల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఎదురైంది. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి మధుసూధనరావు మాట్లాడుతూ పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించాల్సి ఉందని, ఎక్కడికక్కడ లీకేజీలు ఏర్పడి నీటి సరఫరా జరగడం లేదని త్వరలోనే మరమ్మత్తులు నిర్వహించి తాగునీటిని సరఫరా అందజేస్తామని పేర్కొన్నారు.